క్లుప్తంగా

ఈ-పంట నమోదు



తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు ఈ–పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఈ–పంట నమోదును పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో తప్పక తమ పంటల వివరాలను నమోదు చేయించుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు.

గాయత్రి అమ్మవారికి పూజలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గాయత్రి అమ్మ వారి జయంతి వేడుకలు కొండపల్లిలోని మద్విరాట్ విశ్వకర్మ దేవాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం శాంతి హోమం జరిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రతినిధి కత్తురోజు రామకృష్ణ, ఆలూరు మల్లికార్జున శాస్త్రి, కత్తురోజు సతీష్ దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



మల్లేల(తిరువూరురూరల్): తిరువూరు మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం సెప్టెంబరు 18వ తేదీ వరకు కొనసాగుతుందని మండల పశువైద్యాధికారి శ్వేత తెలిపారు. తొలి రోజు మల్లేలలో 200 పశువులకు టీకాలు వేశామని ఆమె చెప్పారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, పశు వైద్య సహాయకులు నాగేంద్ర, జయసాగర్, వెంకటేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

బాలసదనం తనిఖీ



నూజివీడు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని బాలసదనంను ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరానీ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదనంలో 24 మంది పిల్లలు ఉండగా వారికి మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. పిల్లలకు సంబంధించిన అవసరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల డార్మిటరీ, స్టడీ రూమ్, టీవీ రూమ్, కౌన్సెలింగ్ రూమ్‌లను సందర్శించారు. స్టాకును తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేసి, తగు సూచనలు చేశారు. పిల్లలకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు జరిపించేటప్పుడు హెచ్‌బీ పరీక్షలు కూడా చేయించాలని, పరీక్షల ఆధారంగా తగిన ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఏసీడీపీఓ నాగేశ్వరి, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు



ఆగిరిపల్లి: నరసింగపాలెంలో సగ్గూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మంజుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

దొనబండ(ఇబ్రహీంపట్నం): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఒడిశా రాష్ట్రానికి చెందిన క్వారీ కార్మికుడు అజిత్ కుటుంబానికి గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి సౌజన్యంతో బియ్యం, కంది పప్పు, నూనె తదితరాలను మంగళవారం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ప్రమాదాలకు గురవుతున్న క్వారీ కార్మికుల కుటుంబాలకు గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి డైరెక్టర్ మోగులూరి ఎలీషా అండగా నిలవడం అభినందనీయమన్నారు.నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- దోమల నిర్మూలన దినోత్సవం
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు
- దోమలు, వ్యాధుల నియంత్రణపై అవగాహన





గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు : తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, విద్యార్థులు

గణపవరం(మైలవరం): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యోచన అన్నారు. గణపవరం గ్రామంలో ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో దోమల నిర్మూలన అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. డాక్టర్ యోచన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, ఇతర ప్రమాదకర వ్యాధులను సంక్రమింపజేసే కీటకాలు, క్రిములు, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. నీరు నిలిచిన చోట వివిధ రకాల దోమలు పెరుగుతాయని, వీటి ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. ఫ్రై డే డ్రై డేగా పాటించి నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుష్మ, ఏఎన్‌ఎం సుందరమ్మ, ఆశా వర్కర్స్, 104 సిబ్బంది, ఎంపీయూపీ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఎ.కొండూరు:** ఎ.కొండూరులో ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వి. స్వాతి మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎం. బాల మురళీకృష్ణ, హెచ్‌వీ పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం శిరీష, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటుకు గురికావద్దు

తిరువూరు: దోమకాటుతో పలు వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, బోదవ్యాధికి కూడా దోమలు కారణమని చెప్పారు. దోమల నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకుని వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్‌ఎన్ రాజు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **తిరువూరురూరల్:** ప్రపంచ దోమల దినోత్సవాన్ని మంగళవారం తిరువూరు మండలంలో నిర్వహించారు. దోమల వల్ల కలిగే వ్యాధులను తెలియజేస్తూ రాజుగూడెం, చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది ప్రదర్శనలు జరిపారు. నివాస గృహాల నడుమ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని వైద్యాధికారులు పూజిత, చలపతిరావు సూచించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లక్షణాలను వివరించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు మధుసూదనరెడ్డి, చంద్రమోహన్, బేబీ ఫ్లోరెన్స్, సీహెచ్‌ఓ దీవెనమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

చాట్రాయి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024–25లో చేపట్టే పనులపై ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంట కాలువలు, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో పంట కుంటల ఏర్పాటు వంటి పనులు ఈ పథకంలో చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రఘుబాబు, పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణ, వ్యవసాయాధికారి బి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవస్థానం షాపులకు వేలం

విస్సన్నపేట: పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో షాపు నంబర్ 1, 2, 3లో పూజా ద్రవ్యాలు అమ్ముకొనుట, వ్యాపారం చేసుకునే అద్దె హక్కునకు టెండర్ కం బహిరంగ వేలం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో టెండర్ కం బహిరంగ వేలం జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

త్వరలో ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



చంద్రగూడెంలో కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

చంద్రగూడెం(మైలవరం): మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా మిగిలిపోయిన ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల స్థలాల సమస్యపై మంత్రి పార్థసారథితో చర్చించామన్నారు. చంద్రగూడెం గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. సెప్టెంబర్ నాటికి గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. చంద్రగూడెంలో సుమారు 450 మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మూడు సెంట్ల చొప్పున దాదాపు 18 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్టీటీపీఎస్ మహిళా ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఎన్టీటీపీఎస్ మహిళా ఉద్యోగులు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్ద మహిళా ఉద్యోగులు మంగళవారం కొవ్వొత్తులతో రాలీ నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దారుణాలను వారు ఖండించారు. కోల్‌కతా ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలువురు మహిళా ఉద్యోగులు, ఏ, బీ, సీ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

● **నూజివీడు:** కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రతినిధి పురాణం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాలు పోసే వైద్యులపై ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలను తీసుకొచ్చి ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బత్తుల అనురాధ, రంగారావు, శిఖాఆకాష్, ఈమని శేషయ్య, రాజేంద్ర, ఫణి, బాలు, స్నేహా రైడ్స్ సంస్థ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రంగారావు

మైలవరం: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మ నిబ్బరం పెంపొందాలని గ్లోబల్ స్టార్ కన్సల్టెన్సీ మేనేజర్ ఐ.ప్రవల్లిక అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సహకారంతో గ్లోబల్ స్టార్ కన్సల్టెన్సీ సహకారంతో మహిళా ఆరోగ్యం పై వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు అధ్యక్షతన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళల పాత్రను వివరించారు. డెర్మటాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ ప్రమీల మాట్లాడుతూ చర్మ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె. హరిత మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న పీసీఓఎస్, పీసీఓడీ సమస్యను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎ.కొండూరు: తండాలకు కృష్ణాజలాలను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కోడూరు సచివాలయ సిబ్బందికి పలు సమస్యలపై నాయకులు వినతి పత్రం సమర్పించారు. తొలుత సీపీఎం నాయకుల పాదయాత్ర మూడో రోజు మంగళవారం మండలంలోని కోడూరు తండా, కుమ్మరికుంట్ల, రేపూడి తండాల్లో కొనసాగింది. ప్రజల సమస్యలను నాయకులు అడిగి తెలుసుకుని మాట్లాడారు. తండాలలో కిడ్నీ వ్యాధి విస్తరించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కల్యాణ్, నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం





ఈదులగూడెంలో రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన చెత్త (ఇన్‌సెట్) నిలిచిన మురుగు నీరు

ఆగిరిపల్లి: ఈదులగూడెంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలోని రోడ్లపై ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్త, పేడ కుప్పలు, డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభించి గ్రామంలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేశామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో యర్రవారిగూడెం, కొత్తగూడెం, సోమవరం, మర్లపాలెం గ్రామాల్లో కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ఆగిరిపల్లి: విద్యార్థులు, మహిళలు రక్తహీనతకు గురి కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రక్తహీనత నివారణపై ఆరోగ్య కమిటీతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత అధికంగా ఉన్న వారిని గుర్తించి, తగిన పౌష్టికాహారం, మందులు వాడేలా చూడాలన్నారు. గ్రామాల్లోని మహిళలకు, విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈదర, సగ్గూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగ జ్యోష్ణ, మంజుల, మండల విద్యా శాఖాధికారి సర్వేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ కొండపల్లి డివిజన్ కార్యవర్గం ఎన్నిక స్థానిక నాగార్జున విద్యా నికేతన్ పాఠశాలలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా దేవినేని జోసీ కుమారి, కార్యదర్శిగా మహ్మద్ హబీబుల్లా (ఆదర్శ విద్యా నికేతన్), కోశాధికారి ఎస్‌వీఎస్‌ఎస్ ప్రసాద్ (టాలెంట్ హైస్కూల్)తోపాటు మరికొందరిని నూతన కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ పాఠశాలల యజమానులు వెనిగళ్ల మురళీమోహన్, యేషయా బాబు, సాంబశివరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

మైలవరం: మైలవరం మండల పరిధి కనిమెర్ల తండాలో సోమవారం మినరల్ వాటర్ ప్లాంట్ విషయమై వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటనలో ఇరువర్గాలపై రెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాణావతు వాసు వర్గానికి చెందిన 13 మంది, టీడీపీ వర్గానికి చెందిన 17 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వివాదానికి కారణమైన వాటర్‌ప్లాంట్ రెడ్డిగూడెం మండల పరిధిలోకి వస్తుంది కనుక అక్కడ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే లీజు గడువు ముగియక ముందే వాటర్‌ప్లాంట్‌ను స్వాధీనం చేసుకునేందుకు టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి దాడి చేస్తే గాయాల పాలైన తమపై కేసులు నమోదు చేయడమేంటని బాధితవర్గం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన తమను ఆస్పత్రికి కూడా తీసుకువెళ్లకుండా 20 గంటలకు పైగా మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఉంచడం దారుణమని వాపోయారు. నిందితులను కాపాడేందుకే పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారని బాధిత వర్గం ఆరోపిస్తోంది.

దోషులను కఠినంగా శిక్షించాలి



తిరువూరు: విస్సన్నపేట మండలం నూతిపాడుకు చెందిన బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రా సునీత తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, కళాశాలలు, హాస్టళ్ల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పోలే శాంతి, చిగురుపాటి లక్ష్మి, ఎం. వసుంధర పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్‌కు తప్పిన ప్రమాదం

విస్సన్నపేట: చాట్రాయి మండలం నుంచి విస్సన్నపేటకు వస్తున్న ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్ స్టీరింగ్ రాడ్డు తప్పుకుంది. బస్సు కుదుపులకు గురవడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన స్థానిక సత్తుపల్లిరోడ్డులో మంగళవారం జరిగింది. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు.

మంత్రిని కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు



మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సచివాలయ చాంబర్‌లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లో పనిచేస్తున్న 25 వేల మంది కార్మికులు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. తెలంగాణ తరహాలో యాజమాన్యాలే కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. 16 నెలల పెండింగ్ వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని, 20 ఏళ్లుగా ప్రమోషన్‌కు నోచుకోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు మోహనరావు, రాజు, గురవయ్య, వలీ, మునలయ్య పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ, షార్ట్‌హ్యాండ్, టైప్‌రైటింగ్ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ గెస్ట్ ఫ్యాకల్టీకి ఎమ్మెస్సీ జువాలజీలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత, గెస్ట్ ఫ్యాకల్టీ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్‌కు ఏదైనా డిగ్రీ, పీజీతో పాటు టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్, షార్ట్‌హ్యాండ్ లోయర్ గ్రేడ్ ఉండాలన్నారు. ఆసక్తిగల వారు తమ అర్హతలను తెలియజేస్తూ రెండు సెట్ల దరఖాస్తులను బుధవారం మధ్యాహ్నం మూడు గంటలలోగా మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం, రాధానగర్, విజయవాడ–5లో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99665 53949 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

● **ఎ.కొండూరు:** కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ, కామర్స్ అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఝాన్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు బుధవారం సాయంత్రం నాలుగు గంటల లోగా స్థానిక కళాశాలలో రెండు సెట్ల దరఖాస్తులు అందజేయాలన్నారు. జువాలజీ ఎంఎస్సీ, కామర్స్ ఎం కామ్‌లలో 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని చెప్పారు. ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడలోని పాయకపురం రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 98664 95851 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా రహదారులు

- రోడ్లపై భారీ గుంతలు
- వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు



వెల్వడం ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆర్ అండ్ బీ రహదారిలో భారీ గుంత

చంద్రాల(మైలవరం): మైలవరం మండలంలోని పలు రహదారులపై భారీ గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి మండలంలోని వెల్వడం నుంచి చంద్రాల గ్రామం వరకు, అలాగే వెల్వడం నుంచి గణపవరం గ్రామం రహదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. మైలవరం నుంచి నూజివీడు, విజయవాడకు వయా వెల్వడం మీదుగా ఆర్టీసీ బస్‌లు, వందలాది భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడుస్తుంటాయి. వేగంగా వచ్చే వాహనాలు గుంతల వద్దకు రాగానే అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మైలవరం నుంచి నిత్యం ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలమయమైన రోడ్లపై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్లపై తిరగడం వల్ల వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. వెల్వడం ప్రభుత్వ పాఠశాలకు అతి సమీపంలో రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడింది. పక్కనే ప్రభుత్వ పాఠశాల కూడా ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్ బీ అధికారులు స్పందించి మైలవరం, నూజివీడు రహదారిలోని గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



ముసునూరు: క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా మండల స్థాయి ఉపాధ్యాయులకు ముసునూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. పురుషులకు వాలీ బాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, షటిల్ బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్ పోటీలు, మహిళలకు వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్, టెన్నికాయిట్ పోటీలు, క్రీడా విభాగంలో పురుషులు, మహిళలకు 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయ నేతలు బెనర్జీ, గాంగేయుడు వివరించారు. తొలి రోజు 100 మీటర్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పద్మకిషోర్, నాయకులు రాంబాబు, నారాయణ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com